# సాక్షి
## కుమురం భీం

మంగళవారం । 3 । జూన్ । 2025






**జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిశారు**
జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. IIలో▸



**నేటి నుంచి రెవెన్యూ సదస్సులు**
భూసమస్యల పరిష్కారానికి మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. గ్రామాల వారీగా అధికారులు దరఖాస్తులు స్వీకరించనున్నారు. IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /27.3

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసేఅవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 3 నుంచి 13 వరకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. మొత్తం 680 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 240 మంది విద్యార్థులు, కాగజ్‌నగర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది, సిర్పూర్(టి) పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 200 మంది పరీక్షలు రాయనున్నారు. 30 మంది ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కేవలం మూడు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో జైనూర్, లింగాపూర్, కెరమెరి, తిర్యాణి, బెజ్జూర్, దహెగాం మండలాల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని డీఈవో యాదయ్య సూచించారు.

### మోటార్ బిగింపు



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**సాక్షి ఎఫెక్ట్..**

ఆసిఫాబాద్‌అర్బన్: సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'టీఆర్‌నగర్‌లో నీటి కట కట' అనే కథనానికి ఆసిఫాబాద్ మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ భుజంగరావు సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు. బోర్‌కు నూతన 5 హెచ్‌పీ మోటార్ బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పట్టణంలో ఎక్కడైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

### ఆసియా కప్‌లో జిల్లా విద్యార్థిని ప్రతిభ



కప్‌తో సుహాసిని

ఆసిఫాబాద్‌రూరల్: సిర్పూర్(యూ) మండలానికి చెందిన విద్యార్థిని గెడం సుహాసిని ఆసియా కప్ అత్యాపత్యా పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపింది. వెస్ట్ బెంగాల్‌లో ఈ నెల 1న జరిగిన ఆసియా కప్ అత్యాపత్యా పోటీల్లో ఇండియా తరుపున సుహాసిని పాల్గొని బంగారు పతకం సాధించింది. అత్యాపత్యా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు భీంరావు, ఖేలో ఇండియా కోచ్ రాకేశ్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

### రెగ్యులర్ అధికారులను నియమించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో రెగ్యులర్ అధికారులను నియమించాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. జిల్లాలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతుందన్నారు. డీఈవో, డీఎండబ్ల్యూవో, డీబీసీడబ్ల్యూవో, డీఎస్‌వో, డీఐఈవో ఇలా అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు అందరూ ఇన్‌చార్జీలే ఉన్నారన్నారు. విద్యా వ్యవస్థ గాడి తప్పుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టీకానంద్, నాయకులు శ్రావణి, నిఖిల్, మంజుల పాల్గొన్నారు.

### జిల్లా కేంద్రంలో ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: వందరోజుల ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ 10 వరకు తెలంగాణ రైసింగ్‌– 2047 లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. సిబ్బంది సారంగపాణి, భద్రయ్య, సర్వర్, వెంకటేశ్, ఉదయ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో సమగ్రాభివృద్ధి

- నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- భూభారతి చట్టానికి రైతుల నుంచి మద్దతు
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బి.ప్రకాశ్
- జిల్లా కేంద్రంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న డిప్యూటీ చైర్మన్ బి.ప్రకాశ్



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్





అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బి.ప్రకాశ్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా సాగుతోందని, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తున్నామని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బి.ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధ్యక్షతన సోమవారం నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిపై ప్రసంగించారు. 18 నెలల్లో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా దేశంలోనే కాకుండా ప్రపంచంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైసింగ్ 2047' లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే పేద ప్రజలకు మేలు చేసే పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహజ్యోతి, తదితర పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులను గుర్తించి నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

**కోటి మంది మహిళలకు 'మహాలక్ష్మి'**

జిల్లాలో ఒక కోటి మంది మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ఇదివరకే 150 బస్సులు వారికి కొనుగోలు చేసి అందించగా, మరో 600 బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దె ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు మహిళా శక్తి క్యాంటీన్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. 73 వేల కుటుంబాలకు రూ.500 వంట గ్యాస్ అందిస్తున్నట్లు వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను 72వేల కుటుంబాలకు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 1,669 గృహాలు మంజూరు కాగా, రెండో విడతలో 4,410 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతు రుణమాఫీ కింద 51వేల మంది రైతులను రుణ విమోచన చేశామన్నారు. ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను తీర్చిన తొలి రాష్ట్రం తెలంగాణ అని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో చెప్పిన హామీ మేరకు మొదటి సంవత్సరంలోనే 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు రాష్ట్రంలో భర్తీ చేయగా, జిల్లాలో 12 జాబ్ మేళాలు నిర్వహించి 112 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామని, ఇందులో జిల్లాలో 284 పోస్టులు భర్తీ చేశామన్నారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఎకానమీ రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచ వేదికపై ఆవిష్కరించడంలో విజయం సాధించామని, దీనికి నిదర్శనంగా వివిధ రకాల ప్రపంచ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని స్పష్టం చేశారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

**భూసమస్యలకు శాశ్వత పరిష్కారం**

భూసమస్యలతో బాధపడుతున్న రైతులకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్ అన్నారు. క్షేత్రస్థాయిలో దీనికి సంబంధించి రైతుల నుంచి మద్దతు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త కుటుంబాలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులు ఇస్తూ చరిత్ర తిరగ రాస్తుందని హర్షం వ్యక్తం చేశారు. 14 నుంచి 18 ఏళ్ల కౌమార దశ లోని బాలికలకు రక్తహీనత నివారణకు చిక్కీలు అందజేయడానికి నిర్ణయించగా, కుమురం భీం ఆసిఫాబాద్‌ను ఆస్పిరేషన్ జిల్లాగా తీసుకున్నట్లు తెలిపారు. అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా గడిచిన 18 నెలల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

### రైతులకు నాణ్యమైన విత్తనాలు

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 1,203 మంది రైతులకు 1,203 ఎకరాల్లో సాగు చేసేందుకు వీలుగా విత్తనాలు పంపిణీ చేయనున్నారు. డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్ చేతుల మీదుగా పది మంది రైతులకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విత్తనాలు అందించారు.



విత్తనాలు అందజేస్తున్న బి.ప్రకాశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

### అలరించిన నృత్యాలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శాలిని, గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యంతోపాటు కెరమెరి మండలం హట్టి విద్యార్థులు చేసిన గోండు నృత్యం చూపరులను అలరించాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక సారథి బృందం సభ్యులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, తెలంగాణ అమరవీరుల త్యాగాలపై పాటలు పాడారు.





నృత్యం చేస్తున్న విద్యార్థులు

# ఊరిలోనే విత్తనోత్పత్తి



వంజిరి రైతువేదికలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అధికారులు

- 'నాణ్యమైన విత్తనం– రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లాలో 1,203 మంది రైతులు ఎంపిక
- నేటి నుంచి గ్రామాల్లో పంపిణీ

దహెగాం(సిర్పూర్): సాగుకు అత్యంత కీలకమైన నాణ్యమైన విత్తనం కోసం అన్నదాతలు ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఏటా విత్తన ధరలు పెరుగుతుండటంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు నకిలీ విత్తనాల బెడదతో దిగుబడి రాక ఏటా వేలాది మంది రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'నాణ్యమైన విత్తనం– రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో పథకాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించి పదిమంది రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించారు. మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో, ఎంపిక చేసిన రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో వారు విత్తనోత్పత్తి చేసి మరో ఏడాది ఇతర రైతులకు అందించనున్నారు.

**సొంతంగా విత్తనోత్పత్తి**

అన్నదాతలు విత్తనాల కోసం ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డీలర్లు చెప్పిన కంపెనీల విత్తనాలను విత్తుకోవడంతో ఆశించిన దిగుబడి రావడం లేదు. దిగుబడి రాని సమయంలో ప్రైవేట్ కంపెనీలు స్పందించి పరిహారం అందించడంలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. రైతులు ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడకుండా సొంతంగా విత్తనోత్పత్తి చేసుకోవడం ఉత్తమ మార్గమని ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా 'నాణ్యమైన విత్తనం– రైతునేస్తం' పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఈ ఏడాది గ్రామాల్లో కొందరు రైతులను ఎంపిక చేసి విత్తనాలు పంపిణీ చేయనున్నారు. వీరికి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించనున్నారు.


**1,203 మంది ఎంపిక..**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. నాణ్యమైన విత్తనం– రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామం నుంచి ముగ్గురు రైతులను ఎంపిక చేశారు. విత్తనోత్పత్తికి నాణ్యమైన విత్తనాల పంపిణీని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 1,203 మంది రైతులను విత్తనోత్పత్తికి ఎంపిక చేశారు. వీరికి మంగళవారం నుంచి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయనున్నారు. వరి విత్తనాలు 401 కిట్లు, పెసర 402 కిట్లు, కంది విత్తనాలు 400 కిట్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ మూడు పంటలకు సంబంధించిన విత్తనాలు ఇవ్వనున్నారు.

### నాణ్యమైన విత్తనాలతో రైతులకు మేలు

కాగజ్‌నగర్‌రూరల్: నాణ్యమైన విత్తనాలతో రైతులకు మేలు జరుగుతుందని, లాభసాటి వ్యవసాయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని వంజీరి రైతువేదికలో తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రైతులకు నాణ్యమైన వరి, కంది, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రైతులు విత్తనాలు సంప్రదాయ పద్ధతిలో సేకరించుకునేవారన్నారు. విత్తనోత్పత్తి కోసం రైతులకు ప్రభుత్వం విత్తనాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శివకృష్ణ, శాస్త్రవేత్తలు తిరుపతి, వ్యవసాయాధికారులు రామకృష్ణ, మనోహర్, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

### రైతులకు లాభసాటి



మూల విత్తనం ద్వారా సాగు రైతులకు లాభసాటిగా ఉంటుంది. ఈ సీజన్‌లో ప్రభుత్వం అందించే విత్తనాలను సాగు చేసి వచ్చే ఏడాది సహచర రైతులకు అందిస్తారు. ఈ విత్తనాలను ఐదు సీజన్ల వరకు సాగుకు వాడుకోవచ్చు. రైతులకు నకిలీ విత్తనాల బెడద ఉండదు. విత్తనాలు సొంత గ్రామంలోనే లభించడంతో విత్తన కంపెనీలపై ఆధారపడడం ఉండదు. వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు.

– మనోహర్, ఏడీఏ

# రాష్ట్ర అభివృద్ధికి పునరంకితమవుదాం



ఉత్తమ ఉద్యోగిని సన్మానిస్తున్న జీఎం, తదితరులు



బోనాలు, బతుకమ్మలతో సేవా సమితి సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సింగరేణిలో పనిచేసే ప్రతిఒక్కరూ పునరంకితమవ్వాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా జీఎం కార్యాలయంలో తెలంగాణ తల్లి, అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం గోలేటిలోని ప్రధాన రహదారితోపాటు కార్మిక కాలనీల్లో తెలంగాణ రన్ నిర్వహించారు. బెలూన్లు పైకి ఎగురవేశారు. జీఎం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి సంస్థ పాత్ర ఎంతో కీలకంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, కైరిగూడ పీవో నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మలు, బోనాలతో సేవా సమితి సభ్యులు, అధికారులు వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. సేవా సమితి ద్వారా శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్న సభ్యులు, చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జీఎం బహుమతులు అందించారు.

# పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని జైహింద్‌పూర్ గ్రామంలో అటవీ అధికారుల తీరుకు నిరసనగా పంట చేలలో నిరసన చేస్తున్న రైతులతో సోమవారం మాట్లాడారు. ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ప్లాంటేషన్ పేరుతో అటవీ అధికారులు సాగు భూములను లాక్కుంటున్నారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు దీక్ష చేస్తున్న సమీపంలో అక్కడే ఉన్న బెజ్జూర్ ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్‌తో ఆయన మాట్లాడారు. అటవీ అధికారులు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో నాలుగు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న రైతులతో పాటు అటవీశాఖ అధికారులు పోడు భూముల నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ గణపతి, మాజీ సర్పంచులు సుధాకర్, చంద్రమౌళి, నాయకులు రాజన్న, కృష్ణ, సదాశివ్, లస్మయ్య, శంకర్‌గౌడ్, ఉమామహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 108లో కవలల జననం



చిన్నారులను అప్పగిస్తున్న ఈఎంటీ సతీశ్

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన కదం మానస సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్సులో ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. పైలట్ రాజారాం వాహనం పక్కకు నిలిపివేయడంతో ఈఎంటీ సతీశ్ ఈఆర్‌సీపీ డాక్టర్ కసిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. అతని సూచనల మేరకు పురుడు పోశారు. పండంటి ఇద్దరు కవలలు (ఆడబిడ్డలు) జన్మించారు. అనంతరం మహిళకు రిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు.

### పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

కౌటాల: మండలంలోని వైగాంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఎం.మారుతి, వీ.భుజంగరావు, ఎం.రాందాస్, సీహెచ్ నీలకంఠం, ఎస్.రాములు, సీహెచ్ విలాస్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 11,850 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు, 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ చెక్ పోస్టు వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ప్రొహిబిషన్ ఎస్సై ప్రణయ్‌కుమార్ తెలిపారు. తలమడుగు మండలం దేవాపూర్‌కు చెందిన షేక్ నాసిర్ (49) ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

ముధోల్: మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బ్రహ్మణ్‌గాంకు చెందిన పోతన్న (58) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామంలోని చెరువు వద్ద మృతునికి సంబంధించిన వస్తువులు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిశారు

జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఐఐటీ సీట్లు కన్‌ఫామ్ చేసుకున్నారు. ఐఐటీ లక్ష్యంగా చదివి ఉత్తమ ర్యాంకులు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు.


ఎస్.కే సుభాన్


ఎస్.ఆదర్శ్


కె.రంజిత్


జి.చరణ్


డి.రాజేందర్

### సీవోఈ విద్యార్థుల ప్రభంజనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ డ్-2025 పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. సోమవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు ప్రకటించింది. ఇందులో కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా సీవోఈ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. జేఈఈ అడ్వాన్స్ డ్ పరీక్షలు గత మే 18న నిర్వహించారు. 14 మంది పరీక్షకు హాజరుకాగా ఐదుగురు అత్యుత్తమ ర్యాంకులు, మరో నలుగురు ప్రిపరేటరీ ర్యాంకులు సాధించారు. సదరు విద్యార్థులను ర్యాంకుల ప్రాతిపదికన మంగళవారం నుంచి కౌన్సిలింగ్‌కు పిలవనున్నారు.

**ర్యాంకులు సాధించిన విద్యార్థులు**

షేక్ సుభాన్ 32,278, ఎస్.ఆదర్శ్ 3,285, కె.రంజిత్ 3,438, జి.చరణ్ 4,346, డి.రాజేందర్ 5,414 ర్యాంకులు సాధించి విజయ దుందుభి మోగించారు. కె.రామ్‌చరణ్ తేజ 296, సీ.హెచ్.సాయికుమార్ 311, ఎస్.వెంకటేశ్వర్ 1,952, బి.అంజిబాబు 4,790 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించారు. ప్రిన్సిపాల్ ఆకిడి విజయ్‌కుమార్, లెక్చరర్లు ప్రత్యేకంగా అభినందించారు.

### సత్తా చాటిన 'సహనా'



సాదు సహనారెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని సహనారెడ్డి జాతీయస్థాయిలో 3,860 ర్యాంకు సాధించి సత్తా చాటింది. జిల్లాకేంద్రానికి చెందిన సాదు సారిక-రాంరెడ్డి దంపతుల పెద్ద కుమార్తె సహనారెడ్డి చిన్నప్పటి నుంచే చదువుల్లో రాణిస్తోంది. పాఠశాల విద్యను స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాదులోని నారాయణ కళాశాలలో అభ్యసించింది. మెయిన్స్ ఫలితాల్లో 99.49 పర్సెంటైల్, అడ్వాన్స్‌డ్ 3,860 ర్యాంకును కై వసం చేసుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంకును సాధించినట్లు 'సాక్షి'తో పేర్కొన్నారు.

### బాసర వాసికి 1,221 ర్యాంకు

బాసర: నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రానికి చెందిన అశ్విత్ పటేల్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 1221 ర్యాంకు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన బాపూజీ జ్ఞానిపటేల్ వ్యాపారికాగా తల్లి అను ఇంటిపనులు చేసుకుంటోంది. ఈ సందర్భంగా అశ్విత్ పటేల్‌ను పలువురు అభినందించారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.



కుటుంబ సభ్యులతో అశ్విత్ పటేల్

### జేఈఈలో మెరిసిన అమన్



అమన్

లక్ష్మణచాంద: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అమన్ సత్తా చాటాడు. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్-మైమూద దంపతుల కుమారుడైన అమన్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 3,424 ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అమన్‌ను బాబాపూర్ గ్రామస్తులు, మండల వాసులు అభినందించారు.

## పోలీసుల అదుపులో హత్యకేసు నిందితులు?



లక్ష్మి(ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో గతేడాది నవంబర్‌లో మహిళ హత్యకు గురైన సంఘటన సంచలనం సృష్టించింది. కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు ఎట్టకేలకు ఏడు నెలల తర్వాత నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లక్సెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన కూస లక్ష్మి (55) స్నేహితురాలు భీమక్కతో కలిసి మంచిర్యాలలోని గణేశ్‌నగర్‌లో ఓ ఇంటిని కొనుగోలు చేసింది. కొంత కాలం తర్వాత ఇద్దరు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. నవంబర్ 30న అదే ఇంట్లో లక్ష్మి హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా నాలుగు రోజుల క్రితమే మృతి చెందినట్లు గుర్తించారు. ఘటన స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. ఎట్టకేలకు హత్యకు సహకరించిన ఓ మహిళతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## బైక్ దొంగల ముఠా అరెస్ట్

నిర్మల్‌టౌన్: పట్టణంలో కొంతకాలంగా ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ముఠాను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమయత్ నగర్‌కు చెందిన జాదవ్ గంగాధర్, గణేశ్, దిగంబర్ జల్సాలకు అలవాటుపడి ముఠాగా ఏర్పడ్డారు. వివిధ ప్రాంతాల్లో డమ్మీ తాళాలను ఉపయోగించి 8 బైక్‌లను అపహరించారు. వాటిని అమ్మేందుకు స్థానిక బంగల్‌పేట్ శివారుకు వెళ్లినట్లు సమాచారం రావడంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌ను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

## కలప పట్టివేత

సారంగపూర్: మండలంలోని లింగాపూర్ మీదుగా బోథ్-నిర్మల్ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న కలపను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు డీఆర్‌వో నజీర్‌ఖాన్, ఎఫ్‌ఆర్‌వో రామక్రిష్ణారావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు డీఆర్‌వో నజీర్‌ఖాన్ సిబ్బందితో కలిసి గస్తీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో లింగాపూర్ అటవీ ప్రాంతం మీదుగా ట్రాక్టర్ వెళ్తున్నట్లు గమనించి వెంబడించారు. అధికారుల రాకను పసిగట్టిన దొంగలు ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయారు. అధికారులు నిర్మల్ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ రూ.లక్షా ఆరువేల వరకు ఉంటుందని అంచనా వేశారు.



కలపతో అధికారులు

## సరిహద్దులో 'ఏనుగు' అలర్ట్

చింతలమానెపల్లి(సిర్పూర్): మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయనే సమాచారంతో అటవీశాఖ అధికారులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాణహిత నదీ తీర గ్రామాల్లోని ప్రజలను సోమవారం సాయంత్రం అప్రమత్తం చేశారు. చింతలమానెపల్లి మండలం రణవెల్లి, బూరెపల్లి, కోర్సిని తదితర గ్రామాల్లో డప్పు చాటింపు వేయించారు. గతేడాది మహారాష్ట్ర వైపు చౌడంపల్లి అటవీ ప్రాంతం నుంచి ప్రాణహిత నదిని దాటి బూరెపల్లి గ్రామం నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ఏనుగు ప్రవేశించిన నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన ఓ ఏనుగు దాడిచేయడంతో బూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన కారు పోశన్న ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా డిప్యూటి రేంజ్ అధికారి హైమావతి ఆధ్వర్యంలో సరిహద్దులోని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని, ఏనుగుపై దాడికి ప్రయత్నించవద్దని సూచించారు. నెల రోజుల క్రితం మహారాష్ట్రలోని గడ్చిరోలి పట్టణంలోని రహదారులపై ఏనుగులు తిరగడం సంచలనం సృష్టించింది. చాముర్షి తాలూకా అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు ప్రాణహిత నదివైపు సంచరించే అవకాశాలు ఉన్నట్లుగా అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



బూరెపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

### చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీఐ



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ రమణమూర్తి

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఇటీవల బాధ్యతలు స్వీకరించిన లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి తనిఖీ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను తరలించే అవకాశం ఉన్నందువల్ల ముందస్తుగా ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

### ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన మహ్మద్ అలీమొద్దీన్ సోమవారం మహారాష్ట్ర నుంచి పశువులను తీసుకువచ్చి వధించేందుకు సిద్ధంగా ఉంచాడు. తన ఇంటి ముందు కట్టి ఉంచిన ఎనిమిది ఎద్దులను వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకొని గోశాలకు తరలించారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

### బాసరలో భక్తుల రద్దీ



అక్షరాభ్యాస మండపంలో భక్తులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి భక్తులు తరలివచ్చారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకుల చేత అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. 1000 రూపాయల అభ్యాసం టికెట్లు 280, 150 అక్షరాభ్యాసం టికెట్లు 425, వివిధ ఆర్జిత సేవల టికెట్ల ద్వారా ఆలయానికి రూ.8.25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### కొనసాగుతున్న క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. సోమవారం గుడిపేట్ బెటాలియన్‌లో గ్రీన్, యెల్లో జట్లకు పోటీలు నిర్వహించగా మొదటి ఇన్నింగ్స్‌లో గ్రీన్ జట్టు 328 పరుగులు, యెల్లో జట్టు 274 పరుగులు సాధించాయి. రెండో ఇన్నింగ్స్‌లో యెల్లో జట్టు 158 పరుగులు, గ్రీన్ జట్టు 274 పరుగులు సాధించగా, గ్రీన్ జట్టు విజయం సాధించినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జి.చరణ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా అవినాశ్ జాదవ్, బెస్ట్ బౌలర్‌గా అనిరుధ్ నిలిచారు.

### ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. పది, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం పొందేందుకు ఆగస్టు 1, 2024 నాటికి 14సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. మొదటి దఫా అడ్మిషన్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దాఖలు ఈ నెల 2నుంచి 21 వరకు ఉంటుందని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఆయా ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

### తెలంగాణలో సింగరేణి కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి సంస్థ కీలకమని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో సింగరేణి హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కొత్త బొగ్గు బావులు వస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు సోమవారం ప్రకటించిన ఐఐటీ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల వివిధ కేటగిరీల జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. అజ్మీరా పురుషోత్తంనాయక్ 166వ ర్యాంకు సాధించగా.. పి.ఎస్.సాయిధృవ 557, ఎస్.అనిరుధ్‌సాయి 657, బి.ఆదిత్య 945, బి.విష్ణు 1,203, ఎం.అక్షిత 1,224, వి.హృషికేశ్ 1,329, ఆర్.గోవర్ధన్ 1,506, జె.వామిక 1,604, బి.చైత్రవ్ రాజు 1,640, ఇ.శశిలాల్ 1,899, కె.వీరేంద్రప్రసాద్ 2,120, డి.కార్తీక్‌రెడ్డి 2,150, ఎస్.విఘ్నేశ్ 2,293, డి.అభిరామ్ 2,349, ఎ.శశిప్రీతమ్ 2,463, ఇ.అంకిత్‌సాయి 2,613, మహ్మద్ అబ్దుల్ హక్ 2,766, డి.విశాల్ 2,917 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారని సంతోషం వ్యక్తం చేశారు. వెయ్యి లోపు నలుగురు, 2వేల లోపు 11 మంది, 3వేల లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు.

## ఎస్‌ఆర్ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి

కరీంనగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎస్.పవన్ 204వ ర్యాంక్, ఎం.కార్తీక్ 1,009, బానోవత్ సుమన్ 1,049, బుర్ర మాధవ్ 1,471, నీరటి శ్రీచరణ్‌జోష్ 1,321, గుగులోతు శేఖర్ 1,328, ముదిగంటి రుషిశ్వర్‌రెడ్డి 2,318, దొనకొండ సాయిచందన 3,218, దయ్యాల రాజ్‌కుమార్ 6,519వ ర్యాంకు సాధించి విద్యాసంస్థల ప్రతిభను మరింత పెంచారని విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిశల కృషి ఇంతటి ఘన విజయానికి తోడ్పడ్డాయని వివరించారు. అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక బృందానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్ సంతోష్ రెడ్డి, డీజీఎం, సీఈవో, జోనల్ ఇన్‌చార్జిలు, అకాడమిక్ డీన్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ విజయభేరి




విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ మనోహర్‌రెడ్డి

కరీంనగర్: జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎ.రఘుపతి జాతీయస్థాయిలో 40వ ర్యాంకు, నిఖిత్ నాయక్ 194, డి.మహేశ్ 225, రఘుపతి 226, బి.సిద్ధిక 1,107, సీహెచ్.ఐశ్వర్య 1,129, ఠాగూర్ 1,274, నవదీప్ 1,701, నిస్సీ జాస్పర్ 2,172, ఎ.అజయ్ 3,077, అక్షర 4,524 ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, స్పష్టమైన ప్రణాళిక, మెరుగైన విద్యా బోధన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఉత్తమ ర్యాంకులు సాధించామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, అందుకు అనుగుణంగా బోధనా పద్ధతులు అవలంబించిడం జరుగుతుందని, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎస్సెస్సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తమ కాలేజీలో ఫీజు రాయితీ ఇస్తున్నామని వివరించారు. ఈఏడాది నుంచి ఐఐటీ-అడ్వాన్స్‌డ్ లాంగ్‌టర్మ్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రాబోయే నీట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఉత్తమ ర్యాంకుల సాధన కేవలం ట్రినిటీ కళాశాలలకే సాధ్యమని, విద్యార్థుల కృషి, యాజమాన్యం భరోసా, అధ్యాపకుల శ్రద్ధ వల్లే ఈ ఫలితాలు అని తెలిపారు. క్యాంపస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా



నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలంగాణ ఉద్యమ చరిత్రను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఒక సామూహిక చైతన్యమని, సమానత్వం కోసం సాగిన పోరాటమన్నారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పీహెచ్‌డీ, ఎంటెక్ కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ విట్టల్, నాగరాజు, డాక్టర్ మహేష్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కన్వీనర్ ప్రభాకర్ రావు, పీడీ శ్యాంబాబు, పీఈటీలు స్వప్న, వసంత, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తా జాతీయ జెండా ఎగురవేశారు. అంతకు ముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.

## ఆసిఫాబాద్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన రామ్‌చరణ్ (14)కు ఐదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో కాలుకు వేసిన ఇనుప రాడ్డును (ఇంప్లాంట్ రిమూవల్ ఆఫ్ క్లానికల్ బోన్ ఆపరేషన్) తొలగించారన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఉండడంతో రానున్న రోజుల్లో జిల్లా ఆసుపత్రిలో హెర్నియా, ట్యూబెక్టమీ, వేసెక్టమీ ఆపరేషన్‌లు కూడా అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. రోగులకు నాణ్యమైన సేవలను అందించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఆపరేషన్ విజయవంతంగా చేసిన వైద్యులు తిరుమలేష్, నర్సింగ్ స్టాఫ్ సుమిత్ర, హేమలతతో పాటు థియేటర్ అసిస్టెంట్ మౌనికను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?



నేడు వరల్డ్ సైకిల్ డే



# మొదటి వాహనముకు వందనం!

సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఎ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది. అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజ్ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

## ఆపదలో అండగా...



కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరుబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలొకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటిఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

## దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే... 'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

### బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 2న ముగింపు రూ.లలో

| | |
|---|---|
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 97,110 |
| బంగారం (22 క్యారెట్లు) | 90,069 |
| వెండి | 99,500 |
| **విజయవాడ** | |
| బంగారం (24 క్యారెట్లు) | 98,670 |
| బంగారం (22 క్యారెట్లు) | 89,500 |
| వెండి | 1,00,100 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 97,910 |
| బంగారం (22 క్యారెట్లు) | 89,751 |
| వెండి | 1,01,090 |
| **రాజమండ్రి** | |
| బంగారం (24 క్యారెట్లు) | 98,670 |
| బంగారం (22 క్యారెట్లు) | 92,180 |
| వెండి | 1,00,100 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 96,250 |
| బంగారం (22 క్యారెట్లు) | 88,550 |
| వెండి | 98,600 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 97,630 |
| బంగారం (22 క్యారెట్లు) | 89,500 |
| వెండి | 1,11,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## సాగుబడి

రోహిణి కార్తె: జూన్ 8 వరకు
మృగశిర కార్తె: 8 నుంచి





# 'విత్తన బిళ్ల'లతో వరి నాట్లు!



వరి విత్తనాలతో నారుమడి పోసి, తర్వాత పొలంలో నాటేయటం మనకు తెలుసు. అయితే, కేరళకు చెందిన **అజి థామస్** అనే రైతు వినూత్నంగా ట్రేలలో విత్తన బిళ్లల్లో నారు పెంచి, ఆ తర్వాత బిళ్లలతో కూడిన నారునే పొలంలో నాటుతున్నారు. ఎకరానికి 2.5-5 కిలోల వరి విత్తనాలు చాలు. 20 రోజులు ముందే పంట కోతకు వస్తోంది. కూలీల ఖర్చు 75% తగ్గింది. హెక్టారుకు 5.5-6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని ఆవిష్కర్త చెబుతున్నారు.

- ఆవు పేడ, పంచగవ్య, జీవామృతంతో కూడిన బయో స్లర్రీతో వరి విత్తన బిళ్లల తయారీ
- విత్తన బిళ్లల్లో పెరిగిన వరి నారుతో పొలంలో నాట్లు
- మొక్కకు 50–60 పిలకలు.. హెక్టారుకు 6 టన్నుల ధాన్యం దిగుబడి
- 75% తగ్గిన మానవ శ్రమ
- కేరళ రైతు శాస్త్రవేత్త అజి థామస్ అద్భుత ఆవిష్కరణ

కేరళలోని వయనాడ్ జిల్లా అంబలవాయల్‌కు చెందిన అజి థామస్ కూరగాయలు, అరటి, రబ్బరుతో పాటు వరిని పండిస్తారు. రైతులు తగిన ఆదాయం లేక వరి సాగు మానుకుంటున్నారు. ఈ పూర్వరంగంలో బయో స్లర్రీతో వరి విత్తనాల 'పెల్లెటైజేషన్' పద్ధతిని ఆయన అభివృద్ధి చేశారు. విత్తనం చుట్టూ మట్టిని లేపనం చేస్తే వాటిని విత్తన గుళికలు అనొచ్చు. ఇది అలా కాదు. నాలుగు పలకలుగా ఉండే పేడ తదితర పోషకాలతో కూడిన బిళ్లలో వరి విత్తనం పెంచి, నాట్లేస్తారు. కాబట్టి 'విత్తన బిళ్లలు' అని చెప్పుకుందాం.

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై అధ్యయనం చేసి బయో స్లర్రీలోని సూక్ష్మజీవులు పొలం మట్టిలోని పోషకాలను విచ్ఛిన్నం చేసి వరి మొక్కలకు అందించటంతో రెట్టింపు దిగుబడి వస్తున్నదని వారు తెలిపారు.

ఈ పద్ధతిలో హెక్టారుకు 5.5–6 టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని, వయనాడ్ ప్రాంతంలో సాధారణ పద్ధతిలో వచ్చే ధాన్యం దిగుబడితో పోల్చితే రెట్టింపని థామస్ తెలిపారు. కూలీల ఖర్చు 25 శాతానికి తగ్గింది. ప్రతి కుదురుకు 50–60 పిలకలు వస్తున్నాయి. కంకి పొడవు పెరిగింది. ఎకరానికి వరి విత్తనాల అవసరం 30–50 కిలోల నుంచి 2.5–5 కిలోలకు తగ్గింది. పంట 15–20 రోజులు ముందే కోతకు వస్తోందని అజి థామస్ తెలిపారు.

**విత్తన బిళ్లల తయారీ ఖర్చు ఎంత?**

హెక్టారుకు సరిపడా వరి విత్తన బిళ్లల తయారీకి 12–14 కిలోల బయో–స్లర్రీ అవసరం. దీనికి హెక్టారుకు రూ. 20 వేల వరకు ఖర్చవుతుందని అంచనా. ఇది సాధారణ రసాయనిక సాగు పద్ధతిలో ఎరువులు, ఇతర ఉత్పాదకాల సగటు ఖర్చు కంటే రెట్టింపు. అయినప్పటికీ, కూలీల అవసరం/ఖర్చు, విత్తనాల ఖర్చు తగ్గి ధాన్యం దిగుబడి రెట్టింపు కావటంతో ఈ పద్ధతిలో వరి సాగు లాభదాయకంగా మారిందని థామస్ వివరించారు.

**ప్రభుత్వ ప్రోత్సాహం**

కేరళ ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఈ పద్ధతిని ప్రోత్సహిస్తోంది. దీంతో, ఈ పద్ధతి కేరళలో రైతుల ఆదరణ పొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అజి థామస్ చెబుతున్నారు.

**'విత్తన బిళ్ల' అంటే? తయారీ ఎలా?**

వరి విత్తనాలను ట్రేలలోని చిన్న చిన్న చతురస్రాకారపు గదుల్లో బయో స్లర్రీని నింపి, అందులో వరి విత్తనం పెట్టి, మొలకెత్తిస్తారు. ఆ తర్వాత పొలంలో నాట్లు వేసే పద్ధతి ఇది. ఆవుపేడ, పులియబెట్టిన ఆకుల ద్రావణం, పంచగవ్య, ద్రవ జీవామృతంతో పాటు సూడోమోనాస్, అజోస్పిరిల్లమ్ వంటి జీవన ఎరువులు కలిపి బయో–స్లర్రీ మిశ్రమాన్ని తయారు చేస్తారు. బల్ల మీద ఉంచిన స్టెయిన్‌లెస్ స్టీల్ ట్రేలో లేదా సాధారణ బోలు రబ్బరు మ్యాట్‌లో 1–1.5 అంగుళాల లోతు/పొడవు/వెడల్పుతో నలుచదరంగా ఉండే గుంతల్లో బయో స్లర్రీని పోసి, అందులో వరి విత్తనాలను గుచ్చుతారు. ఒక రోజులో ఆ స్లర్రీ గట్టిపడి విత్తన బిళ్లలు తయారవుతాయి. ఆ తర్వాత ట్రే నుంచి విత్తనంతో కూడిన ఆ బిళ్లలను బయటకు తీసి 12 గంటలు ఎండబెడతారు. ఆ తర్వాత వాటిపై నీరు చిలకరిస్తారు. 3 రోజుల్లో వరి మొలకలు బయటకు వచ్చి, తగినంత ఎత్తు పెరిగిన తర్వాత, ఆ బిళ్లతో కూడిన వరి నారును దమ్ము చేసిన పొలాల్లో మనుషులతో వరుసలుగా నాటుతారు. వరుసల మధ్య 25 సెం.మీ. (పది అంగుళాలు) దూరం పెడుతున్నారు. ఎకరానికి ఇట్లాంటి వరి నారు బిళ్లలు 64 వేలు అవసరమవుతాయి. ఇదే ప్యాడీ సీడ్ పెల్లెటైజేషన్ పద్ధతి.

జఠిలమైన చెదలుకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాన్ని కనుగొన్న రాజస్థాన్ వృద్ధ మహిళా రైతు

యూకలిప్టస్ కర్ర ముక్కలను పొలంలో ఉంచటం ద్వారా.. చెద పురుగులు పంటలను పాడు చెయ్యకుండా కాపాడుతున్నారు



# చెదలుకు యూకలిప్టస్‌తో చెక్!

చెద పురుగులు.. ఇళ్లలోనే కాదు, పంట పొలాల్లో కూడా సమస్యలు సృష్టిస్తుంటాయి. పంటలను ఆశిస్తూ 10 నుంచి 50% వరకు దిగుబడి నష్టం కలిగిస్తుంటాయి. రైతులు సాధారణంగా రసాయనాలు చల్లి పంట పొలాల్లో చెదలును నియంత్రించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే, రసాయనాలతో పని లేకుండా సులభంగా, స్వల్ప ఖర్చుతో చెదలు సమస్యకు పరిష్కారాన్ని వెదకటంలో ఓ వృద్ధ మహిళా రైతు అసాధారణమైన విజయం సాధించారు. యూకలిప్టస్ కొమ్మలు/కట్టె ముక్కలను పొలంలోని పంటల సాళ్ల మధ్య ఉంచితే, చెద పురుగులు పక్కనే ఉన్న పంటల జోలికి వెళ్లకుండా యూకలిప్టస్ కొమ్మలనే ఆశిస్తున్నాయని ఆమె కనుగొన్నారు.

**తళుక్కుమన్న ఉపాయం**

పనులు చేస్తూనే అసాధారణంగా ఉన్న విషయాలను గమనిస్తూ ఉండటం భగవతి దేవికి అలవాటు. వంట కలపను ఇంటికి తెచ్చి పొయ్యిలో పెడుతున్న ఒక సందర్భంలో ఆమె దృష్టిని యూకలిప్టస్ కర్రలు ఆకర్షించాయి. యూకలిప్టస్ కర్ర ముక్కల పైకి మిగతా కర్రల కంటే చాలా ఎక్కువ చెదపురుగులు చేరుతున్నట్లు ఆమె గుర్తించారు. ఈ గ్రహింపు కలిగిన మరుక్షణమే ఆమె మదిలో ఒక కొత్త ఉపాయం తళుక్కున మెరిసింది. ఆలోచన వచ్చిందే తడవుగా అప్పుడు సాగులో ఉన్న సజ్జ పంటలో అమలు చేసింది. 2 నుంచి 3 అడుగుల పొడవు, 2 నుంచి 3 అంగుళాల లావు ఉన్న యూకలిప్టస్ కర్ర ముక్కలను తీసుకొని, సజ్జ పొలం అంతటా సాళ్ల మధ్యలో పెట్టింది. ఆమె అనుకున్నట్లుగానే, ఆ కర్ర ముక్కల చుట్టూ వేలకొలది చెద పురుగులు చేరి, కర్రలను కొరికి తినటం ప్రారంభించాయి. ఆశ్చర్యమేమిటంటే.. చెద పురుగులు ఇక సజ్జ మొక్కల జోలికి పోలేదు. యూకలిప్టస్ కర్ర ముక్క నుంచి 4 అంగుళాల దూరంలో ఉన్న సజ్జ మొక్కలను కూడా అవి ఆశించలేదు. అంతే. భగవతి దేవి మోహం ఆనందంతో వెలిగిపోయింది.

**సజ్జ నుంచి గోధుమ వరకు..**

గోధుమ చేనులో 12×12 మీటర్ల దూరంలో ఎకరానికి 32 చొప్పున స్ప్రింక్లరు ఉంటాయి. ప్రతి స్ప్రింక్లర్‌కు దగ్గర్లో ఒక యూకలిప్టస్ కట్టె ముక్క/కొమ్మను ఆమె పెట్టారు. ఒక్క గోధుమ మొక్కను కూడా చెదలు ఆశించలేదు. ఒక్కో కట్టె ముక్కను వేలకొద్దీ చెద పురుగులు చుట్టుముట్టాయి. అంటే పంట వైపు నుంచి ఈ యూకలిప్టస్ కట్టెలు చెదపురుగుల దృష్టిని వంద శాతం మళ్లించాయన్న మాట. ఎకరానికి ఖర్చు కేవలం రూ. 320లు. ఈ కట్టెలను ప్రతి పంట కాలానికీ కొత్తవి వేయాల్సిన అవసరం లేదు. మూడు పంటల వరకు అవే సరిపోతున్నాయని ఆమె తెలిపారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయ గుర్తింపు**

భగవతి దేవి ఈ విషయాన్ని ఫతేపూర్ షెఖావతిలోని కేవీకే శాస్త్రవేత్తల చెప్పారు. వరుసగా నాలుగేళ్ల పాటు అనేక పంటల్లో ప్రయోగం చేసి సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. బికనెర్‌లోని రాజస్థాన్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బార్లీ పంటలోనూ అద్భుత ఫలితాలు రావటంతో, రైతులందరికీ ఇది అనుసరించమని చెబుతున్నారు.

# చిరుధాన్యాలను సాళ్లుగా విత్తుకుంటేనే మేలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకోవటానికి అనువైన 11 రకాల చిరుధాన్యాల విత్తనాలను విక్రయిస్తున్నారు. జొన్నలు, పచ్చజొన్నలు ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి. ఇతర చిరుధాన్యాలన్నీ ఎకరానికి 2 కిలోలు సరిపోతాయని, ఎకరానికి సరిపోయే విత్తనంతో బ్యాగ్‌లను సిద్ధం చేశామని ఐఐఎంఆర్ విత్తన విభాగం సాంకేతిక అధికారి రఘునాథ్ కులకర్ణి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

**వరుసలుగా విత్తుకుంటే మేలు:** చిరుధాన్య పంటలను వెదజల్లటం కాకుండా వరుసలుగా విత్తుకోవటం మేలు. కూలీలతో కలుపు తీయిస్తే రైతుకు మిగిలేదేమీ ఉండదు. వరుసలుగా విత్తుకుంటే యంత్రాలతో అంతరసేద్యం చేస్తూ కలుపును నిర్మూలించుకోవచ్చు. సాధారణంగా వరుసల మధ్య 22.5

### ఐఐఎంఆర్‌లో 11 రకాల చిరుధాన్యాల విత్తనాలు సిద్ధం

సెం.మీ. దూరం పెడతారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న వీడర్ యంత్రాల వెడల్పును బట్టి సాళ మధ్య దూరాన్ని నిర్ణయించుకోవచ్చు. అవసరాన్ని బట్టి 30 సెం.మీ. / 40 సెం.మీ. / 45 సెం.మీ. వరకు కూడా సాళ్ల మధ్య దూరం పెట్టుకోవచ్చని రఘునాథ్ వివరించారు.

- జొన్న (దేశీ రకం/ హైబ్రిడ్), పచ్చజొన్న, పచ్చిగడ్డి కోసం పెంచే జొన్న ఎకరానికి 3 కిలోలు విత్తుకోవాలి.
- సజ్జ, రాగు (కెఎంఆర్ 301), కొర్ర (సూర్యనంది), సామ (సిఎల్ఎంవి1), ఊద (డిహెచ్‌బిఎం93-3), వరిగ (టిఎన్ఎయు 202), అరిక (సికెఎంవి2), అండుకొర్ర (హెచ్‌బిఆర్2)లను ఎకరానికి 2 కిలోలు విత్తుకోవాలి. ఈ విత్తనాలు ఐఐఎంఆర్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కెళ్లాలి. ఇతర వివరాలకు.. 040–24599305.

**చిరుధాన్యాల విత్తనాలు దొరికే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు:** నంద్యాల (99896 25208), పెరుమాళ్ళపల్లి (87906 38715), పాలెం (97050 69580)లలోని కూడా కొన్ని రకాల చిరుధాన్య పంటల విత్తనాలు అందుబాటులో ఉంటాయి.

